





ఎటుచూసినా.. ఆహ్లాదకర వాతావరణమే..

అహో..



కొండల నడుమ జలవిందు

- నిండుగా బుక్కపట్నం చెరువు
- ఆహ్లాదం పంచుతున్న పరిసర ప్రాంతాలు
- మురిసిపోతున్న పర్యాటకులు



నిండుకుండను తలపిస్తున్న బుక్కపట్నం చెరువు

పచ్చని కొండలు.. వాటి మధ్యన చెరువు కట్ట. దాని పైనే వాహన వాహన రాకపోకలు.. నిండుగా ఉన్న చెరువు.. ఎటుచూసినా నీరే.. కిందిభాగాన పసిరిక పంచుకున్న ఆయకట్టు.. కాస్త దూరంలో అటవీ ప్రాంతం.. అహో.. ఆ అందాలు చెప్పక్కర్లేదు. అదే బుక్కపట్నం చెరువు ప్రాంతం. రాయల కాలంలో నిర్మించిన చెరువు అందాలను ఎంత చెప్పినా.. తక్కువే అనిపిస్తుంది. రెండో బుక్కరాయలు పాలనా సమయంలో రెండు కొండలను కలుపుతూ చెరువు నిర్మాణం చేపట్టారు. శతాబ్దాలు దాటినా నేటికీ చెక్కు చెదరలేదు. నేటికీ 3 వేల ఎకరాల ఆయకట్టుకు, అంతే మొత్తంలో భూములకు సాగు నీరు అందిస్తోంది. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల నీటి అవసరాలను తీరుస్తోంది. చిత్రావతి నదిపై రెండు కొండలను కలుపుతున్న ఈ చెరువు రాయల అద్భుత నిర్మాణ శైలికి నిదర్శనం. 0.5 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ఉమ్మడి జిల్లాలో అతి పెద్దదైన చెరువు. చిత్రావతిపై కర్ణాటకలో ఆ రాష్ట్ర ప్రభుత్వం పరగోడు ప్రాజెక్టు కట్టాక బుక్కపట్నం చెరువుకు నీరు చేరడం గగనమైంది. చాలా ఏళ్లపాటు వట్టిపోయింది. టీడీపీ హయాంలో హంద్రీనీవా కాలువ ద్వారా నీరిచ్చి చెరువు నింపారు. వేల ఎకరాల ఆయకట్టుకు ప్రాణం పోశారు. ప్రస్తుతం హంద్రీనీవా నీటితో చెరువు పూర్తిగా నిండడంతో చుట్టుపక్కల పరిసరాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తికి వచ్చే దేశవిదేశీ భక్తులు బుక్కపట్నం చెరువు సందర్శనకు వస్తున్నారు. అక్కడ కనీసం కూర్చోవడానికి బల్లలు కూడా లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. చెరువు కట్ట ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి, ట్యాంక్‌బండ్‌లా తీర్చిదిద్దాలని పర్యాటకులు కోరుతున్నారు. అప్పుడు చెరువు అందాలను ఆస్వాదించవచ్చని అభిప్రాయపడుతున్నారు.

-కొత్తచెరువు(ఆంధ్రజ్యోతి)

తాగి.. ఆటో నడుపుతావా..

- డ్రైవర్‌పై మంత్రి సవిత ఆగ్రహం



మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌పై మండిపడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తాగి ఆటో నడుపుతున్న డ్రైవర్ బాలన్నపై బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నుంచి మంత్రి వస్తుండగా.. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆటో అడ్డదిడ్డంగా కాన్వాయ్‌కి అడ్డుగా వచ్చింది. దీంతో మంత్రి కాన్వాయ్‌ని ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి మండిపడ్డారు. తాగి ఆటో నడుపుతూ ఇతర ప్రాణాలతో చెలగాటం ఆడతావా.. అంటూ మండిపడ్డారు. ఇలాంటివారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశులును ఆదేశించారు. వెంటనే డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

సత్వర న్యాయమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యం

- అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



వసతిగృహంలో వంటను పరిశీలిస్తున్న ఏడీజే, న్యాయవాదులు

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా న్యాయసేవాధికార సంస్థ పనిచేస్తుందని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. ఆదివారం జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ.. ఇరువర్గాలకు చెందిన కక్షిదారులు కలిసి వస్తే కేసులను పరిష్కరిస్తామన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించి.. చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక న్యాయాధికారి రమణయ్య, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

కొత్తచెరువు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,481 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1(ఎస్-1)పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, పరీక్ష విభాగ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జయహో..

అనంత ఆతిథ్యం.. ఆట అదుర్స్



త్రోబాల్ ఆడుతున్న ఉద్యోగిని

- రెవెన్యూ క్రీడాపోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా అవతరణ
- అట్టహాసంగా ముగింపు ఉత్సవాలు



అనంతపురం జట్టుకు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం



ఆర్డీటీ స్టేడియంలో బాణసంచా వెలుగులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆతిథ్యంలోనే కాదు, ఆటలోనూ అనంతపురం అదరగొట్టింది. రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాపోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా అవతరించింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున పోటీలు హోరాహోరీగా సాగాయి. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమశాఖ (మిగతా 7లో...)

ముమ్మరంగా ఏర్పాట్లు





వెస్ట్ గేటులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం, హిల్ వ్యూ స్టేడియంలో ముస్తాబవుతున్న వేదిక

సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలోకి వచ్చే ప్రధాన రోడ్లలో పెద్ద సంఖ్యలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. వెస్ట్‌గేటులో పెద్దపెద్ద షెడ్లు నిర్మిస్తున్నారు. ట్రాన్స్‌కో కార్యాలయం దగ్గరలో ప్రశాంతి గ్రామం బస్సు డిపో వెనుక షెడ్లు ఏర్పాటుచేశారు. సత్యసాయి శత జయంతి వేడుకలు హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించనున్నారు. అందుకోసం స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రశాంతి నిలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఇప్పటికే ప్రశాంతి నిలయంలో భక్తుల సందడి పెరిగింది.

-పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి)

పట్టుతప్పిన సాగు

- నల్లచెరువులో ఉనికి కోల్పోయిన మల్బరీ సాగు
- వందల ఎకరాల నుంచి పదుల్లోకి..
- రసాయన మందుల దుష్ప్రభావంతోనే..!



కదిరి పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయం

నల్లచెరువు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో క్లాస్ పంటగా పేరుగడించిన మల్బరీ సాగు మండలంలో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమ, కాల వ్యవధిలో చేతికొచ్చే సెరికల్చర్‌కు నల్లచెరువు మండలం ఒకప్పుడు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. మండల వ్యాప్తంగా దాదాపు 15వందల ఎకరాలకు పైబడి మల్బరీ సాగైనట్లు సెరికల్చర్ అధికారులు చెబుతున్నారు. మల్బరీ సాగు, పట్టుగూళ్ల పెంపకంతో ఎంతో మంది రైతులు ఆర్థికంగా స్థిరపడ్డారు. సెరికల్చర్‌లో మండల రైతుల కృషిని గుర్తించిన ప్రభుత్వం 1994లోనే మల్బరీ సాగులో మెలకువలు తెలుసుకోవడానికి ఇక్కడి రైతులను చైనాకు పంపింది. దీన్నిబట్టి మల్బరీసాగుకు మండలం ఎంత ప్రసిద్ధి చెందిందో ఊహించుకోవచ్చు. అయితే మారిన వాతావరణ పరిస్థితులు, అభిరుచుల నేపథ్యంలో మండలంలో మల్బరీసాగు అంతర్థానమయ్యే పరిస్థితి నెలకొంది. గత వైభవానికి ఆనవాలుగా మండలంలో అక్కడక్కడ మొత్తంగా 30 ఎకరాలకు అటు ఇటుగా మల్బరీ సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రసాయన మందుల వల్లే..

మండలంలో టమోటా, వంకాయ లాంటి కాయగూరల పంటల సాగు పెరిగింది. ఈ పంటల్లో అధిక దిగుబడి, తెగుళ్ల నివారణ కోసం వాడే రసాయనిక మందుల ప్రభావం మల్బరీపై తీవ్రంగా ఉంటుంది. తోటకు వంద మీటర్ల దూరంలో రసాయనిక మందు స్ప్రే చేసినా, గాలి ద్వారా అది మల్బరీ పంటపై పడుతుంది. ఈ ఆకు మల్బరీ పురుగులు తింటే చనిపోతాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. అందుకే రసాయన మందుల ప్రభావం పెరిగిన నేపథ్యంలో మల్బరీ సాగు తగ్గిపోయింది.



మల్బరీ తోట

కరోనా వల్ల కూడా...

కరోనా మహమ్మారితో దేశంలో ఎగుమతులు నిలిపివేయడం వల్ల మల్బరీ రైతులకు తీవ్ర నష్టం జరిగింది. కరోనా తీవ్రత రెండేళ్లు ఉండటంతో ఎగుమతులు లేకపోవడం, గిట్టుబాటుధర రాకపోవడంతో రైతులు పూర్తిగా పంటను వదిలేసి, ప్రత్యామ్నాయ పంటలవైపు వెళ్లిపోయారు.

పది ఎకరాలు సాగు చేసేవాడిని



నేను 2010 సంవత్సరం వరకు 10 ఎకరాల్లో మల్బరీ సాగు చేసేవాడిని. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఉండేది. 1994లోనే సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా చైనాకి వెళ్లి రేషం సాగు గురించి మెలకువలు తెలుసుకున్నా. మల్బరీలో మంచి దిగుబడులు సాధించడంతో విజయవాడలో అప్పటి మంత్రి జగన్‌నాయక్ చేతుల మీదుగా అవార్డు కూడా తీసుకున్నా. పక్కదేశాల్లా పంట నియంత్రణ చట్టం తీసుకువస్తే మల్బరీ రైతులు బాగుపడతారు.

-రైతు కృష్ణారెడ్డి, కె.పూలకుంట


రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి మండలంలో రైతుల దగ్గరకు వెళ్లి మల్బరీ సాగు, లాభాల గురించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వస్తున్న సబ్సిడీల గురించి వివరిస్తున్నాం. కొత్తగా ప్రభుత్వం వారు దిగుబడి సహాయం కూడా అందజేస్తున్నారు. పట్టు గూళ్లపై కిలోకు రూ.50 చెప్పున ఇంటెన్సివ్ ఇస్తున్నారు. చైనాలో ఉత్పత్తి తగ్గిపోవడంతో అన్ని దేశాల వారు మన వైపు చూస్తున్నారు. ఇక ముందు మల్బరీ సాగు పెరిగే అవకాశం ఉంది.

-మస్తాన్, సెరికల్చర్ అధికారి

ముగిసిన అఖండ భజన



అఖండ భజనలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు అఖండ భజన ముగిసింది. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన భజన ఆదివారం సాయంత్రం ముగిసింది. సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిపాటలు ఆలపించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, నారాయణ సేవ అందించారు.

పనితీరే కొలమానం..!

టీచర్ నుంచి డీఈఓ వరకు కేపీఐ విధానం

- పిల్లల సామర్థ్యాల పెంపునకు కసరత్తు
- ప్రగతి ఆధారంగా పాయింట్లు
- త్వరలో మార్గదర్శకాలు
- విద్యాశాఖాధికారులు, టీచర్లలో టెన్షన్

7



అంతుచిక్కని రహస్యం..!

- తుంగభద్ర ఎగువ కాలువలో శవాలు
- వరుసగా మూడు కొట్టుకొచ్చిన వైనం..

7



తుంగభద్ర ఎగువ కాలువ

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించండి

పోలీసులకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు

యాడికి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణలో ఉండాలని ఉపాధ్యాయుల మందలింపును జీర్ణించుకోలేక కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై దాడులకు సిద్ధమవుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆదర్శ పాఠశాలలో కొందరు విద్యార్థుల ఆగడాలు, అసభ్య ప్రవర్తనలు ఎక్కువ కావడంతో వారిని మందలించి, తల్లిదండ్రులను పిలిపించి తెలియజేశారు. దీనిని జీర్ణించుకోలేని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహంతో హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. తల్లిదండ్రులు అతిగా స్పందించి ఉపాధ్యాయులపై దూకుడుగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పాఠశాల భద్రత, సజావుగా పనిచేయడానికి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌లో విన్నవించడం గమనార్హం. విద్యార్థులకు మొబైల్ ఫోన్లు సరైన వాడకం, పాఠశాలలో అమ్మాయిలు, అబ్బాయిల మధ్య సరైన ప్రవర్తన, సాధారణ క్రమశిక్షణ గురించి పాఠశాల ప్రిన్సిపాల్ సలహా ఇచ్చినపుడు దానిని పాటించాల్సిన విద్యార్థులు, పాటించేలా చేయాల్సిన తల్లిదండ్రులు అతిగా స్పందించడంతోనే సమస్య తలెత్తినట్లు తెలిసింది. దీంతో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది అభద్రతా భావంలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఈనెల 6న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

అనంతపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈయూ జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం విజయవంతం కోసం ఎండీ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకూ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. సిబ్బందికి ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేదిశగా ప్రభుత్వం, యాజమాన్యం చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగోన్నతుల విషయంలో డివిజన్ స్థాయి సీనియారిటీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. స్త్రీశక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రానికి కనీసం మూడు వేల బస్సుల అవసరం ఉందన్నారు. పదివేల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. బస్సులు పెంచక, సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో పని భారం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కొన్ని ప్రాంతాల్లో స్త్రీశక్తి బస్సుల్లో విధులకు వెళ్లాలంటేనే కండక్టర్లు, డ్రైవర్లు భయపడే పరిస్థితి ఉందని తెలిపారు. తనిఖీ అధికారులు రాస్తున్న కేసులపై వాస్తవ పరిస్థితులు గమనించకుండా డిపో మేనేజర్లు సస్పెండ్ చేస్తున్న విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తబస్సులు ప్రవేశపెట్టకపోవడంవల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఈయూ జిల్లా కార్యదర్శి పీయస్ ఖాన్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, నాయకులు కొండయ్య, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఓబులరత్నం, పీఎస్‌పీ ఖాన్, కల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

తాడిపత్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఇండియన్ పబ్లిక్‌స్కూల్ చెందిన విద్యార్థులు వెంకట శ్రీచేతన్‌రెడ్డి, అనిమి అస్మిత జాతీయ చెస్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. ఈనెల 7, 8, 9తేదీలలో పార్వతీపురం మన్యం జిల్లాలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ చెస్ పోటీలు నిర్వహించారని వివరించారు. ఈ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి అండర్-14 బాలుర విభాగంలో వెంకట శ్రీచేతన్‌రెడ్డి ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో అనిమి అస్మిత మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయిందన్నారు. త్రిపుర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

క్రికెట్ పోటీలకు..



అమూల్య

గుంతకల్లుటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న బట్నపాడు అమూల్య జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయి ఆదివారం తెలిపారు. ఈనెల 6, 7తేదీలలో శ్రీకాకుళంలో రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ పోటీలు జరిగాయి. జిల్లా జట్టు తరఫున అమూల్య పాల్గొంది. ఈ పోటీల్లో అనంతపురం జట్టు మొదటి స్థానంలో నిలచింది. వికెట్ కీపర్‌గా అమూల్య అద్భుత ప్రదర్శన కనబరిచిందన్నారు. దీంతో జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికయింది. డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్‌లో ఆంధ్రజట్టు తరఫున అమూల్య పోటీలో పాల్గొంటుందన్నారు.

జాతీయ స్థాయి శిబిరానికి..



అర్షియా

తాడిపత్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ సబ్‌జూనియర్ సెలక్షన్ పోటీల్లో స్థానిక సంజీవనగర్ మూడో రోడ్డులోని శ్రీసాయిచైతన్య స్కూల్ విద్యార్థి అర్షియా ప్రతిభ చాటింది. దీంతో ఆమె జాతీయస్థాయి క్యాంప్‌నకు ఎంపికైనట్లు కోచ్ లక్ష్మీనరసింహ తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



నూతన కమిటీ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నిక ఆదివారం స్థానిక ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు హాజరయ్యారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మధుప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా విజయశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఇసాక్ జమాల్‌బాషా, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓబుళదాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జ్యువెలరీ అసోసియేషన్..



ఎంపికైన కమిటీ

కళ్యాణదుర్గం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా జ్యువెలరీ అసోసియేషన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక పాతూరులో ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా శివప్రసాద్, అధ్యక్షుడిగా గొంది జనార్దన్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా జయం విశ్వనాథ్, కోశాధికారిగా అనిల్ అగర్వాల్, సహాయ కార్యదర్శిగా బద్రీనాథ్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఇలియాస్, టీవీ సురేష్ బాబు, రంగాచారి, సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని బంగారు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని అన్నారు. మిగతా కమిటీ సభ్యులను నియమించుకుని ముందుకు వెళ్తామని తెలిపారు.

జయహో..





మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, మ్యాంచో ఫెర్రర్‌ను సన్మానిస్తున్న మంత్రులు అనగాని, సవిత, ఎమ్మెల్యే దగ్గుపాటి

(5వ పేజీ తరువాయి)

మంత్రి సవిత, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం అర్బన్, పుట్టపర్తి ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఏపీ రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ పాల్గొన్నారు. క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం, ఆర్డీటీ సహకారం మరువలేనిదన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను ఘనంగా సత్కరించారు. బాణసంచా పేలుళ్లతో ముగింపు ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు.



షటిల్ ఆడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్

ఓవరాల్ చాంపియన్‌గా అనంతపురం

రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాల్లో 38 పాయింట్లతో అనంతపురం ఓవరాల్ చాంపియన్‌గా అవలరించింది. 37పాయింట్లతో విశాఖపట్నం, 30 పాయింట్లతో కాకినాడ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. క్రికెట్‌లో అనంతపురం చాంపియన్‌గా అవతరించింది. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీఓ మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజేష్, ఇరు జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మధునాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, విశ్వనాథ్‌చౌదరి, వసంతబాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, తాహసీల్దార్లు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న మంత్రి సవిత

అంతుచిక్కని రహస్యం..!

తుంగభద్ర కాలువలో మృతదేహాలు

వరుసగా మూడు కొట్టుకొచ్చిన వైనం..

పట్టించుకోని పోలీసులు

బొమ్మనహాళ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర కాలువ ఇప్పుడు భయానకంగా మారింది. రెండు రోజుల్లో మూడు శవాలు తేలిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బొమ్మనహాళ్ హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 116, 11 కిలో మీటర్ల వద్ద శనివారం రెండు మృతుదేహాలు బయటపడగా.. ఆదివారం మరో శవం తేలింది. కాళ్లకు తాళ్లు కట్టేసి ఉండటంతో మరింత మిస్టరీగా మారింది. వరుస సంఘటనలు జరుగుతున్నా పోలీసుల్లో కదలిక లేదు. బొమ్మనహాళ్, డి. హీరేహాళ్ పోలీసులు నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ శవాలు కర్ణాటక నుంచి వచ్చాయా.. ఆంధ్ర ప్రాంతానికి చెందినవేనా అని తేల్చాల్సి ఉంది. కాలువలో రోజుకొక శవం పుట్టుకొస్తుండడంతో స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. శవాలను తాళ్లతో కట్టేయడం చూస్తే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యలా.. ఆత్మహత్యలా..? పోలీసులే నిర్ధారించాలి. తుంగభద్ర కాలువ పరిసర గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకే ప్రాంతంలో వరుసగా మూడు మృతదేహాలు తేలిపోవడం మిస్టరీగా ఉందని చర్చించుకుంటున్నారు.

పనితీరే కొలమానం..!

టీచర్ నుంచి డీఈఓ వరకు కేపీఐ విధానం

పిల్లల సామర్థ్యాల పెంపునకు కసరత్తు

ప్రగతి ఆధారంగా పాయింట్లు

త్వరలో మార్గదర్శకాలు

విద్యాశాఖాధికారులు, టీచర్లలో టెన్షన్



అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇంత ఖర్చుపెడుతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ఇప్పటికీ అనుకున్న మేరకు సామర్థ్యాలు ఉండడంలేదు. చాలా మంది విద్యార్థులకు గుణింతాలు, చదవడం, రాయడం రావడంలేదని కేంద్రం చేయించిన సర్వేలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు, టీచర్లలో మరింత బాధ్యత పెంచడానికి ఆ శాఖ కమిషనర్ అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి అన్ని శాఖల పనితీరుకు అమలు చేస్తున్న కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్(కేపీఐ) విధానాన్ని విద్యాశాఖకు ప్రత్యేకంగా తీసుకొస్తున్నారు. ఈ విధానంతో డీఈఓ నుంచి డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లకు కేడర్ల వారీగా లక్ష్యం నిర్ణయించి.. అందులో సాధించిన ప్రగతి గురించి ఆరాతీస్తారు. వాటి ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు.

డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు ఇలా...

పాఠశాలల పర్యవేక్షణలో విద్యాశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒకవేళ తనిఖీలకు వెళ్లినా తూతూ మంత్రంగా వ్యవహరించి వస్తున్నారనే ప్రచారం ఉంది. దీంతో విద్యాశాఖ కమిషనర్ ఇక నుంచి అధికారులకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు రోజూ పాఠశాలలను తనిఖీ చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. ఏ పాఠశాలకు వెళ్లారు.. అక్కడ ఏమేమి పరిశీలించారు.. నిర్దేశించిన లక్ష్యాలు అక్కడ ఉన్నాయా.. టీచర్ల పనితీరు, పిల్లల సామర్థ్యాలు తదితర వాటిని రికార్డుల్లో నమోదు చేయాలి. తర్వాత వారికి సమయం ఇవ్వాలి. ఆ సమయం తర్వాత ఆ పాఠశాలకు వెళ్లి మళ్లీ పరిశీలించాలి. అప్పటికి ఇచ్చిన లక్ష్యం సాధించారా.. పాఠశాల పరిస్థితి అలాగే ఉందా తదితర అంశాలను పరిశీలించాలి. వీటన్నింటిని డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పక్కాగా నమోదు చేసి పంపాలి. అపుడు ఈ అధికారుల పనితీరుకు రాష్ట్ర విద్యాశాఖ కేపీఐ కింద పాయింట్లను కేటాయిస్తుంది.

విద్యార్థుల సామర్థ్యాలే హెచ్‌ఎం, టీచర్లకు ప్రామాణికం

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆ పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. హెచ్‌ఎం.. అకడమిక్ మేరకు బోధన చేయిస్తున్నారా.. వారానికి ఐదు పీరియడ్లు పాఠాలు చెబుతున్నారా.. పాఠశాలకు వచ్చిన నిధులు నిబంధనల మేరకు సక్రమంగా వినియోగించారా.. అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉందా.. అని పరిశీలించి పాయింట్లు ఇస్తారు. టీచర్లకు.. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అ,ఆలు, ఎక్కాలు, రెండెంకల పదాలు, చదవడం, రాయడం వంటివి వస్తున్నాయా లేదా అని పరిశీలిస్తారు. ఉన్నత పాఠశాల స్థాయిలో.. 6 నుంచి 10వ తరగతి వరకు గుణింతాలు వస్తున్నాయా.. ఇంగ్లీష్ చదవడం.. ఆయా సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో పరిగణలోకి తీసుకొని కేపీఐ పాయింట్లు కేటాయిస్తారు.

లీప్ యాప్‌లో నమోదు చేయాల్సిందే..

విద్యార్థుల సామర్థ్యాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సబ్జెక్టు టీచర్లే లీప్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సబ్జెక్టుల వారిగా టీచర్లు పిల్లల ప్రగతి నివేదికలను వారి సెల్‌ఫోన్ నుంచే నమోదు చేయాలి. దీని ఆధారంగా ఆ స్కూల్ హెచ్‌ఎం, టీచర్లకు కేపీఐ పాయింట్లు కేటాయిస్తారు. ఈ పాయింట్ల ఆధారంగా డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఆయా స్కూల్ హెచ్‌ఎంలు, టీచర్లకు బదిలీలు, పాలనా పరంగా ప్రాధాన్యతలు ఇచ్చే అవకాశం భవిష్యత్తులో ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లలో టెన్షన్ మొదలయింది.

కేపీఐ మార్గదర్శకాలు రావాల్సి ఉంది



పనితీరు ఆధారంగా పాయింట్లు నిర్ణయిస్తున్న విషయం వాస్తవమే. దీనివల్ల బాధ్యత పెరిగి మెరుగ్గా పనిచేయడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే కమిషనర్ కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్(కేపీఐ) పెడుతున్నట్లు కాన్ఫరెన్స్‌లో చెప్పారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ముందుకు సాగుతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

అంతర్ జిల్లాల జూడో చాంపియన్ 'అనంతపురం'

అండర్-17 బాల, బాలికల విభాగాల్లో

విజేతలుగా ఆవిర్భావం

సర్పవరం జంక్షన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల జూడో చాంపియన్లుగా అనంతపురం జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 పోటీలు రెండు రోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో హోరాహోరీగా సాగాయి. ఫైనల్ పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి హైస్కూలు క్రీడా ప్రాంగణంలో రసవత్తరంగా జరిగాయి. బాల, బాలికల విభాగాల్లో అనంతపురం జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. విజేతలకు కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్, కాకినాడ రూరల్ ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు, ఎంఈవో-2 శ్రీనివాస్‌కుమార్, జూడో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో కృష్ణా (ద్వితీయ), కర్నూలు (తృతీయ), బాలికల విభాగంలో చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జిల్లాల జట్ల క్రీడాకారులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కె.శ్రీనివాస్, పీఈటీల సంఘ కార్యదర్శి వి.మాచరిరావు, కోశాధికారి కె.నాగలింగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకుడు ప్రతాపరెడ్డి, రవిరాజు, గిరి, ప్రసాదరెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.





అంతర్ జిల్లాల జూడో చాంపియన్లుగా నిలిచిన అనంతపురం బాలికల, బాలుర జట్లు

గూండాల్లా వ్యవహరిస్తే చర్యలు

వైసీపీ నేతలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఆగ్రహం

బాధిత నాయకులకు పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షుడు, నేతలు

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అధికారం పోయినా... ఇంకా గూండాల్లా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హెచ్చరించారు. నార్పల మండలంలో వైసీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన టీడీపీ నాయకుడు, వారి కుటుంబీకులను ఆయన పరామర్శించారు. నాయనపల్లి మాజీ సర్పంచ్ ఓబులమ్మ కుమారుడు వెంకటరాముడు మీద వైసీపీ నాయకులు భూ వివాదంలో దాడి చేసి గాయపర్చారు. దీంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరాముడు, వారి కుటుంబీలను వెంకటశివుడు యాదవ్‌తో పాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. వైసీపీ గూండాలు టీడీపీ నేత, వారి కుటుంబీకులపై దాడి చేయడం దారుణం అన్నారు. వైసీపీ నాయకులు ఇలాగే వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, ఎర్రినాగప్ప, నారాయణస్వామి, రాజు, లక్ష్మీనారాయణ, వెంకటేష్, గంగాధర్ నాయుడు, నగేష్, ఆదినారాయణ, శంకర్, నాగరాజు, నార్పల నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరంలో డ్రైవర్ హత్య

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో ఓ డ్రైవర్ హత్యకు గురయ్యాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన షేక్ మాలిన్‌బాషా(40) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన బోయ కులస్థురాలైన రాధ అలియాస్ బేగంను 14 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. మాలిన్‌బాషా తన భార్యకు వేరేవారితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానం పెంచుకుని మద్యం సేవించి తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాధ పట్టణంలోని తన పుట్టినింటికి వెళ్లి సమస్యను కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆమె సోదరుడు రామచంద్ర, మరికొందరు వచ్చి వైఎస్ఆర్ కాలనీలో ఇంటి వద్ద ఉన్న మాలిన్‌బాషాను కట్టెలతో దాడి చేసి అక్కడే ఉన్న పూలకుండితో తలపై బాదారు. దీంతో మాలిన్‌బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు సీఐ రెడ్డప్ప వెంటనే సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దాడి చేసిన వారు పరారీలో ఉన్నట్టు సమాచారం.

గుండెపోటుతో రైలులో ప్రయాణికుడి మృతి



రాకేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్-1బోగిలో ప్రయాణిస్తున్న మాచర్ల రాకేష్(44) అనే ప్రయాణికుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి భార్య, జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన మాచర్ల రాకేష్, అతడి భార్య విద్య, కుమార్తె ఇతర కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి వెళ్లేందుకు ట్రైన్ నెంబర్ 22159 ముంబై- చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం రాత్రి బయలుదేరారు. రైలు దౌండ్ రైల్వే స్టేషన్ సమీపంలో రాగానే రాకేష్ గుండెలో నొప్పి వస్తోందని భార్యకు చెప్పాడు. ఇక్కడ దిగిపోదామని భార్య చెప్పినా రాకేష్ వారించాడు. రాయచూరు స్టేషన్‌వద్ద రాగానే ఛాతిలో నొప్పి ఎక్కువయింది. విషయాన్ని టీసీకి చెప్పినా ఆపడానికి అవకాశం లేదన్నారు. రైలు గుంతకల్లు స్టేషన్‌కు చేరుకోగానే రైల్వే ఆసుపత్రి వైద్యులు వచ్చి పరిశీలించారు. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ చంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీ వెల్ఫేర్ డేను జయప్రదం చేయండి

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న మైనార్టీ వెల్ఫేర్ డే, నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డీడీ రామసుబ్బారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న మౌలానా అబుల్ కలామ్ అజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రామసుబ్బారెడ్డి కోరారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు..?

ముదిగుబ్బ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతలు పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం అనంతపురం వైపు నుంచి వస్తున్న వాహనాల తనిఖీల్లో భాగంగా గంజాయి తరలిస్తున్న ముదిగుబ్బకు చెందిన పది మంది విక్రేతలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గంజాయి ఎంత ఉంది, విక్రేతలు ఇంకా ఎవరెవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం కూడా ముదిగుబ్బ రైల్వే స్టేషన్ సమీపంలో పెద్ద మొత్తంలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

రైతులే టార్గెట్‌గా చోరీలు



తుమ్మల, సీతారంపల్లి వద్ద ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు

● వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
● ఆయిల్, కాపర్‌వైరు చోరీ ● బెంబేలెత్తుతున్న రైతులు

ధర్మవరం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొద్దికాలం క్రితం వరకు ఆలయాలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోయారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవడంతో ఇప్పుడు రైతుల పొలాలను టార్గెట్‌గా చేసుకున్నారు. వేలకు వేలు ఖర్చుచేసుకుని పంటలకు విద్యుత్‌కనెక్షన్ కోసం రైతులు అమర్చుకున్న ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని ఆయిల్‌ను, కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్తుండడంతో విద్యుత్‌సరఫరా లేక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండురోజుల్లోపే సీతారంపల్లి, తుమ్మల గ్రామాల్లో గుర్తు తెలియని దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు. ధర్మవరం మండల పరిధిలో అధికశాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పోలీసులు ఫిర్యాదులు తీసుకుని వదిలేస్తుండడంతో దొంగలు పేట్రేగిపోతున్నారని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తుండడంతో తీరా చేతికొచ్చే సమయంలో వేరుశనగ, అలసంద పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అధికారులను అడిగితే వెంటనే రావని సమాధానం చెబుతున్నారని రైతులు తెలుపుతున్నారు. అయితే తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టి.. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడుకుంటున్నా... దొంగతనాలతో మరింత నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో రైతులు పొలాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు వాట్సప్‌గ్రూప్‌ల ద్వారా మెసేజ్‌లు పంపుతున్నారు. పోలీసులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారని వరుస చోరీలు జరుగుతున్నా గ్రామాల్లో గస్తీ పోలీసులు ఎందుకు కనిపించరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రెండురోజుల్లో ధ్వంసం ఇలా...

● సీతారంపల్లిలో ఈ నెల 5న రైతులు బసిరెడ్డిగారి నారపరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి పొలాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులో విలువైన కాపర్, ఆయిల్‌ను, విద్యుత్ పరికరాలను చోరీచేశారు. ఈ రైతులు తమపొలాల్లో వేరుశనగ, వరి, అలసంద, చీనీతోటలను సాగుచేస్తున్నారు. కరెంట్ సరఫరా లేక పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● తుమ్మల గ్రామంలో ఈనెల 7న అర్ధరాత్రి శివారెడ్డి పొలంలో అమర్చిన ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్, కాపర్‌తో పాటు విలువైన విద్యుత్ పరికరాలను ఎత్తుకెళ్లారు. ఆ రైతు తమ పొలంలో చీనీతోట, వేరుశనగ సాగుచేశాడు. అయితే తీరా పంటలు చేతికొచ్చే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడంతో పంటలు ఎండిపోతాయని ఆ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. అదే గ్రామంలోనే నరసింహారెడ్డి కి చెందిన గ్రామ సమీపంలోని పట్టుగూళ్లషెడ్డు తాళాలు పగలగొట్టారు. షెడ్డుకు ఉన్న ఫెన్సింగ్‌ను కట్‌చేసి ఎత్తుకెళ్లారు.

● నేలకోట, ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, బిల్వంపల్లిల్లో ఇటీవల తరచూ రైతుల పొలాల్లో స్ప్రింకర్లు, స్టార్టర్ పెట్టెలు, కేబుల్, పైపుల చోరీలు జరుగుతున్నాయని ఆ గ్రామ రైతులు ఆవేదనవ్యక్తం చేశారు. పంటలు చేతికొచ్చేసమయంలో ఇలా వ్యవసాయ పరికరాలు చోరీకి గురికావడంతో అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. చోరీలపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

4 ఎకరాల్లో ఎండిపోతున్న వేరుశనగ



మాపొలంలో నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. దిగుబడి సమయంలో మూడురోజుల క్రితం మా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్ చోరీ చేశారు. దీంతో పంట చేతికొచ్చే సమయంలో నీటితడులు ఇవ్వకపోతే పంటంతా అందకుండా పోతుంది. పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ అధికారులు స్పందించి కరెంట్ సరపరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. చోరీపై పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాం.

- బసిరెడ్డిగారి నారపరెడ్డి, సీతారంపల్లి, ధర్మవరం మండలం

దిగుబడిపై ఆందోళన



మా పొలంలో ఐదెకరాల్లో చీనీతోట, మూడెకరాల్లో వేరుశెనగ సాగుచేస్తున్నా. అయితే రెండు రోజులక్రితం మా పొలంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను చోరీ చేశారు. పొలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను కట్ చేసి ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం చీనీపంట, వేరుశనగ దిగుబడి వచ్చే దశలో ఉన్నాయి. కరెంటు లేకపోవడంతో పంటలు ఎండుపోతున్నాయి. దీంతో నెలలు శ్రమించిన పంట చేతికొచ్చే సమయంలో దిగుబడిపై ఆందోళనగా ఉంది.

-శివారెడ్డి, రైతు, తుమ్మల, ధర్మవరం మండలం

చోరీలను అరికడతాం

చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటుచేశాం. త్వరలోనే దొంగలను పట్టుకుని ఈ చోరీలను అరికడతాం. ఇటీవల దేవాలయాల్లో జరిగిన పలు చోరీలను అరికట్టి, దుండుగలను అరెస్టుచేసి రికవరీ చేశాం. రాత్రివేళాల్లో గస్తీ ముమ్మరం చేసి చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

-ప్రభాకర్, సీఐ, ధర్మవరం రూరల్

న్యూస్ బాక్స్

పెద్దమ్మ దేవతకు పూజలు



అలంకరణలో పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మకు కార్తీక మాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, వేపమండలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు పెద్దన్న, శివసాయి తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతపురం, హిందూపురం, తాడిపత్రికి చెందిన భకులు అమ్మవారికి పట్టుచీరలు, గాజులు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



సుంకులమ్మ దేవికి పూజలు చేయిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువుకట్ట వద్ద వెలసిన బొజ్జకట్ట సుంకులమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామతృభిషేకం, అర్చనలు చేశా రు. హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సుంకలమ్మదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. బీజేపీ నాయకులు జింకా చంద్రశేఖర్, చంద్రమౌళి, మహేశ్, జింకా ప్రవీణ్‌కుమార్, నబీరసూల్, ఈశ్వర్‌నాయక్, కురుబ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి

బత్తలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అనంతసాగరం గ్రామంలో నూత నంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం రామలింగే శ్వరస్వామి, అమ్మవారు, వినా యకుడు, కుమారస్వామి విగ్రహాల తోపాటు ధ్వజ స్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హోమాలు వివిధ పూజా కార్యక్రమాలను వేదిపండితులు నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్ర జ్వాలాతోరణం నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి కొబ్బరి కాయలు కొట్టించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఎస్‌ఐ సోమశేఖర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు మంజుల వెంకటేశు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అబుల్ కలాం జయంతిని విజయవంతం చేయండి

పుట్టపర్తిరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ మొట్టమొద టి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి రామసుబ్బారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ మీటింగ్‌హాల్‌లో మౌలానా చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించే కార్యక్రమానికి జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, ముస్లిం కమ్యూనిటీ ప్రజలు, మేధావులు విద్యావేత్తలు, జిల్లా అధికారులు పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

125 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణసంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 85 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. పేదలకు కంటిచూపు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభూషణ, క్యాంపు చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జయచంద్ర,కొండయ్య, శ్రీనివాసులరెడ్డి, పెరుమాళ్లదాస్, రమేశ్‌బాబు తదతరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య



శివ మృతదేహం

ధర్మవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాగుడు మానమని భార్య చెప్పినందుకు మనస్తాపానికి గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని లోనికోటకు చెందిన శివ(36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్య నవనీత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన శివ ఆదివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించి కుటుంబసభ్యులు శివను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శివ భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

నడింపల్లికి చెందిన మహిళ...

నల్లచెరువు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నడింపల్లికి చెందిన సాకే సుకన్య(32) అనే మహిళ ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నడింపల్లికి చెందిన సాకే సుకన్యకు మూడేళ్ల క్రితం పక్క గ్రామమైన సుబ్బరాయనపల్లికి చెందిన కేశ వులు అనే వ్యక్తితో వివాహం జరిగింది. మనస్పర్థల కారణం గా వారు దాదాపు సంవత్సర కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. సుకన్య నడింపల్లిలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆమె ఆదివారం సుబ్బరాయనపల్లి చెరువుకట్ట వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మక్బూల్ తెలిపారు.

వైభవంగా కార్తీక వనభోజనాలు



హోమాలు చేస్తున్న వేద పండితులు, (ఇన్‌సెట్‌లో) చంద్రమౌళీశ్వరుడు

ధర్మవరం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరులో పురాతన చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధాత్రి నారాయణ పూజ, అభిషేకాలు, హోమాలు, కార్తీక వనభోజనాల ను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను అర్చకులు రాఘవ శర్మ, ఆయన శిష్య బృందం వేద మంత్రాల నడుమ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు ధర్మవరం పట్టణ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా ఆలయంలో చంద్రమౌళీ శ్వర స్వామి లింగాన్ని ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్త జనం పాల్గొన్నారు.

'చదువుతో పాటు చట్టం తెలుసుకోండి'

కదిరిలీగల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు చట్టాల పైనా ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని బాలికల హాస్టల్‌లో నిర్వ హించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. హాస్టల్ అధికారి ప్రసన్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. జాతీయ న్యాయ సేవల దినోత్స ఔన్నత్యాన్ని వివరించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుపైనే దృష్టిని కేంద్రీకరించాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులకు సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన 2022-25 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. ఒకరినొకరు యోగ క్షమాలను అడిగి తెలుసుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకు న్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలసి ఆనందంగా గడిపారు. నాటి అధ్యాపకులు నేర్పిన విద్యాబుద్ధులు గుర్తుకు తెచ్చుకుని ప్రస్తుత సమాజంలో ఓ స్థాయిలో జీవిస్తుండటం గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నాటి అధ్యాపకులు రాజన్న, ఓబయ్య, శశాంక్, ప్రశాంతిని పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో కళాశాల అబివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

పాడిరైతులకు తప్పని కష్టాలు

పశు వైద్యశాలల్లో కనిపించని వైద్యులు



అమడగూరులోని పశువైద్యశాల

అమడగూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన అమడగూరు మండలంలో వ్యవసాయంతో రైతులు ప్రతి యేటా నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేయలేక, పంటలు సాగిచేసినా పెట్టుబడులు తిరిరాని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో చాలామంది రైతులు రైతులు పాడిపరిశ్రమపై మక్కువ చూపుతున్నారు. ఎవరి శక్తి వారు రెండు లేదా నాలుగు ఆవులు, గేదెలు పెట్టుకొని పాలవ్యాపారం చేస్తున్నారు. డెయిరీలకు పాలు పోస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. అయితే వాటి వద్దకు ఎప్పుడు వెళ్లినా పశు వైద్యులు కనపడరు. దీంతో మండల ప్రజలు పశు వైద్యం గురించి ఎవరిని అడగాలో తెలియన అయోమయ స్థితిలో పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండకేంద్రంలోని పశు వైద్యులు ధనుంజయులు బదిలీపై వెళ్లారు. దీంతో తనకల్లు మండలంలోని బొంతలపల్లి పశువైద్య కేంద్రం పశువైద్యులు హరినాథ్‌రెడ్డి ఇన్‌చార్జ్ వైద్యుడిగా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన వారంలో ఒక రోజు అమడగూరుకు వచ్చి వెళుతుంటారని రైతులు తెలిపారు. దీంతో పశువులకు ఏ వ్యాధి వచ్చినా ప్రైవేటుగా మందులు కొనాల్సిందే. పశువైద్యశాలకు వెళ్లి మందు లు అడిగితే ఇంటికి ఇచ్చేందుకు కుదరదు, ఇక్కడికే పశువులను తీసుకొస్తే మందులు ఇచ్చి చూస్తామని సిబ్బంది చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. మండలవ్యాప్తంగా ఆవులు 5403, గేదెలు 346, గొర్రెలు 57675, మేకలు 9280, ఇతర పశువులు 1570 ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబు తున్నాయి. వీటికి సేవలు అందించేందుకు పంచాయతీకి ఒకరు చొప్పున వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించారు. డబ్బు చెల్లిస్తే తప్ప వారు వైద్యం అందించరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో పశువైద్యంపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు అంటున్నారు. వైద్యులను నియమించి అన్ని వేళలా అందుబాటులో ఉండేలా చూడాలని పాడి రైతులు కోరుతున్నారు.

మందులు ఇచ్చే వారు లేరు



నాకు 120 గొర్రెలు ఉన్నాయి. ఇప్పుడున్న వాతావరణాన్ని బట్టి రోగాలు వస్తున్నాయి. మందులు అడిగితే ఇచ్చేవారు లేరు. పశువైద్యశాలలో డాక్టర్‌లు లేరు. వెటర్నరీ అసిస్టెంట్‌ను అడిగితే బయట కొనాలని చెబుతున్నారు. మాకు ప్రభుత్వం నుంచి వచ్చే మందులు ఇస్తే, మేము డబ్బులు పెట్టి కొనాల్సిన అవసరం ఉండదు, డాక్టర్‌ను ఏర్పాటు చేసి మందులు అందిస్తే బాగుంటుంది.

- మహేష్, మహమ్మదాబాద్

పాలతో జీవనం సాగిస్తున్నాం



నేను రెండు గేదెలు పెట్టుకొని పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నా. ఆ గేదెలు అనారోగ్య భారిన పడినప్పుడు పోషకాలు తగ్గితే బాటిల్ పెట్టించేందుకు, మందులకు రూ.వెయ్యి దాకా ఖర్చు అవుతోంది. ప్రభుత్వ పశువైద్యులు వాటిని అందించి మందులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-వెంకటరమణ, ఇద్దేవాండ్లపల్లి

పశువైద్యుడిని ఏర్పాటు చేస్తాం

డాక్టర్ లేనిది వాస్తవమే, పంచాయతీకొక వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నారు. ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు, వైద్యుడిని కూడా ఏర్పాటు చేసి పాడి రైతులకు అవసరమ్యే మందులు అందించి ఇబ్బంది లేకుండా చూస్తాం.

-కేశవయ్య, ఏడీ

అయ్యప్పస్వామి గ్రామోత్సవం



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

గాండ్లపెంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా నాలుగో రోజు అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహం, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శివలింగం, నందీశ్వరుడు, హంసవాహనం, మూషికవాహనం తదితర విగ్రహాలను చిన్నమిట్ట అయ్యప్పస్వామి ఆలయం నుంచి మండల కేంద్రంలో ఊరేగించారు. మండలంలోని అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు. గాండ్లపెంట ఎస్‌ఐ క్రాంతి కుమార్ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఘనంగా జియారత్ వేడుకలు

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న సయ్యద్ మహమ్మద్ ఖాదర్‌వలీ రహంతుల్లా అలైహి దర్గాలో ఆదివారం ఘనంగా జియారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దర్గాకమిటీ గౌరవాధ్యక్షుడు సోలిగాళ్ల చిన్న వెంకటేశులు పేర్కొన్నారు. ముస్లింలు చక్కెర చదివింపు చేయించి, నమాజు చేశారు. అధ్యాత్మిక గురువులచే ఉపన్యాసం, బయాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉరుసు కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

విద్యుత్ సమస్యలపై అధికారుల పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన

నల్లమాడ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చోట్ల నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఆ శాఖ అధికారులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం 'అందుబాటులోని విద్యుత్ సిబ్బంది' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఏడీ ఓబులేసు, లైన్‌మ్యాన్ ఆనంద్ మండలంలోని చౌటకుం టపల్లికి చెందిన రైతు నాగభూషణరెడ్డి మామిడి తోటలోకి వెళ్లారు. చెట్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. సంబంధిత లైన్‌మ్యాన్ ను పిలిపించి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని ఎర్రవంకపల్లి రైతు రామచం ద్రారెడ్డికి చెందిన పొలంలో ఉన్న మామిడితోటలో చేతికందే ఎత్తులో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను పరిశీలించారు. అలాగే నల్లమాడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో కిందనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను, కేశవరెడ్డి ఇంటి వెనుకభాగంలో చింతమానులో వెళ్లిన విద్యుత్ వైర్లను పరిశీలించారు. వీటన్నింటిని రెండు, మూడురో జుల్లో పరిష్కరిస్తామని రైతులకు ఏడీ హామీ ఇచ్చారు.

కలిసికట్టుగా హక్కులను సాధించుకుందాం

● ఎన్ఎంయూ రీజినల్ సెక్రటరీ



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంతో హక్కులను సాధించుకుందామని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) రీజినల్ సెక్రటరీ షబ్బీర్ పేర్కొన్నారు స్థానిక ఎన్జీఓహోంలో ఆదివారం ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ప్రభాకర్ అధ్యక్షతన యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాడు. ముఖ్యఅతిథులుగా రీజనల్ సెక్రటరీ షబ్బీర్, డిపో గౌరవాధ్యక్షుడు డోలా రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఎన్ఎంయూ కార్మికుల పక్షాన పోరాడి అనేక డిమాండ్లను సాధించిందన్నారు. అనంతరం డిపో నూతన కమిటీని ఎంపికచేశారు. డిపో చైర్మన్‌గా హనుమాన్, అధ్యక్షుడిగా గోపాల్, సెక్రటరీగా మధుసూదన్, కోశాధికారిగా వైవీఎన్ రెడ్డి, గ్యారేజ్ అధ్యక్షుడిగా డీఆర్ కుమార్, సెక్రటరీగా హరికృష్ణను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఎన్ఎంయూ జోనల్ నాయకులు బీఎస్ శేఖర్, ఏఎస్ రావు, రీజినల్ చైర్మన్ ముత్యాలప్ప, అధ్యక్షుడు శ్రీరామ్‌నాయక్, నాయకులు ఎస్ఎంసహేబ్, మోహన, జీవై నాగప్ప, ప్రసాద్, దుర్గాప్రసాద్, బీవీలక్ష్మి, సీసీఎస్ డెలిగేట్ జేఎస్‌రాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో

జిల్లా జట్టుకు మూడో స్థానం



మూడో స్థానం సాధించిన జిల్లా జట్టు

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో జిల్లా బాలికల జట్టు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు కబడ్డీ కోచ్‌లు పృథ్వీ, నగరనరసింహులు ఆదివారం తెలిపారు. కడపజిల్లా పులివెందులలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరిగినట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో 26 జిల్లాల జట్లు తలపడగా జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించడం సంతోషకరమని అన్నారు. దీంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు విశ్వనాథ్‌చౌదరి, కబడ్డి అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సుహాసిని, కోచ్‌లు ఆ జట్టును అభినందించారు.

పడకేసిన పారిశుధ్యం



ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగునీరు

నల్లచెరువు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కె.పూలకుంట పంచా యతీలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో ఏ వీధి చూసినా చెత్తకుప్పలు, రోడ్లపై పారుతున్న మురుగునీరు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీటితో పాటు మురుగునీరు చేరి ఇళ్ల మధ్యలో పారుతోంది. దీంతో గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారై, గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి కె.పూలకుంట గ్రామం నుంచి రోగులు అధిక సంఖ్యలో నమోదవుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి, పారిశుధ్య పనులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాత సేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వర స్వామికి, మల్లేశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

మడకశిరకు చేరిన రాఘవేంద్రస్వామి విగ్రహం



మడకశిరటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ వెనకభాగంలో రాఘవేంద్ర స్వామి విగ్రహ ఆవిష్కరణకు ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆదివారం స్వామివారి విగ్రహాన్ని మడకశిరకు తీసుకురావడంతో అంజనేయస్వామి దేవాలయంలో ఉంచి పూజలు జరిపించారు. ధాన్యావాసం, విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. డిసెంబరులో రాఘవేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

పురంలో గురునానక్ జయంతి



పండ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో గురునానక్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేశారు. పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ జబీవుల్లా, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, న్యాయవాది ఇందాద్, ఉమర్‌ఫారూక్, ఆసిఫ్, ఇమ్రాన్ అలీఖాన్, పలవిందర్‌సింగ్, భగవాన్‌సింగ్, సత్యపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని స్త్రీ శక్తి భవనం



శిథిలావస్థకు చేరుకున్న స్త్రీ శక్తి భవనం

అగళి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 28 లక్షలతో భవన నిర్మాణాన్ని చేపట్టింది. అదికూడా అరకొరగానే భవనాన్ని పూర్తిచేశారు. అయినా నేటికీ భవనం ప్రారంభంకాలేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కిటికీలు, డోర్లు, బండలు తదితరాలు పాడయ్యాయి. భవనం లేకపోవడంతో కార్యకలాపాలన్నీ వెలుగు కార్యాలయంలోనే చేపడుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



మాట్లాడుతున్న న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయాధికారి వాసుదేవన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికి వివిధరకాల హక్కులు లభించాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమను తాము కాపాడుకునే వీలుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు అందజేత

రొళ్ల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మాజీ దేవస్థానం అభివృద్ధికి బెంగళూరు మహానగర పాలికె మాజీ ఇంజనీరు సిద్దేగౌడ్ కుటుంబ సభ్యులు రూ.10లక్షలు అందజేశారు. దీంతో వారిని ఆలయ కమిటీ పూలమాలలతో సన్మానించారు.



సిద్దేగౌడ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ ట్రస్టు

అపరిశుభ్రతకు నిలయం కరికెర

పట్టించుకోని అధికారులు



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు



అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాలువ

గుడిబండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర పంచాయతీ గ్రామాలు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. కరికెర పంచాయతీలో దాసరపల్లి, హిరేతుర్పి, హెచ్‌గొల్లహట్టి గ్రామాలున్నాయి. ఈ పంచాయతీ గ్రామాల్లో డ్రైనేజీలు, మురుగు కాలువలు చెత్తా, చెదారం పేరుకుపోయినా సంబంధిత అధికారులు వాటిని తొలగించడంలో విఫలమయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం, మురుగు కాలువలో పేరుకుపోవడంతో ఈగలు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ప్రజలు అంటున్నారు. పంచాయతీ గ్రామాల్లో చెత్తాచెదారం ఎందుకు తొలగించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కరికెర పంచాయతీ గ్రామాల్లో అమలు కావడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు డ్రైనేజీలు శుభ్రంచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

కరికెర పంచాయతీ గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లి గ్రామాలను శుభ్రంగా ఉండేందుకు చర్యలు చేపడతాం. పంచాయతీ గ్రామాలు సందర్శించి నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

-నాగరాజునాయక్, డిప్యూటీ ఎంపీడీఓ

ఆక్రమణల తొలగింపుతో సరి

మురుగు కాలువకు మరమ్మతులేవీ..?



మరమ్మతులకు నోచుకోని మురుగు కాలువ

సోమందేపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని డీఎల్ రోడ్డులో రెండు నెలల క్రితం మురుగు కాలువను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. అప్పటి నుంచి డ్రైనేజీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మురుగునీటి ద్వారా దుర్గంధం వెదజల్లుతోందని అంటున్నారు. దోమలవ్యాప్తి అధికమయ్యిందని, రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 12 అడుగుల రోడ్డులో ఉన్న మురుగుకాలువ తెరిచి ఉండటంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొందరు మురుగు కాలువపై బాత్‌రూంలు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు గృహయజమానులకు నోటీసులు అందించారు. స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించుకునేందుకు గడువు ఇచ్చారు. ఈ దిశలో స్పందనరాకపోవడంతో ఎక్స్‌కావేటర్‌తో ఆక్రమణలను అధికారులు తొలగించారు. అంతేకాకుండా పట్టణంలో అన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు ఆక్రమించివుంటే దశలవారీగా తొలగిస్తామని అప్పట్లో పేర్కొన్నారు. తరువాత ఏమైందో ఏమోకానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అదేవిధంగా ఆక్రమణలు తొలగించినచోట మరమ్మతులు సైతం చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగుకాలువలపై స్లాబ్‌లు ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ వెంకటలక్ష్మీని వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు



భక్తుల జనసందోహం మధ్య సాగుతున్న రథోత్సవం

వైభవంగా బ్రహ్మ రథోత్సవం

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. దేవతామూర్తులకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య సతీసమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాన్ని గిరిపై నుంచి కిందకు తీసుకొచ్చి రథోత్సవంలో ప్రతిష్ఠించి గిరిచుట్టూ భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. రథోత్సవంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు జేపీకే రాము, రాజ్యలక్ష్మీ మోహన్, నర్సింహులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

హోల్‌సేల్ మర్చంట్స్ మాజీ అధ్యక్షుడి మృతి



సుంకు చెన్నక్రిష్ణయ్య(ఫైల్)

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూపురం హోల్‌సేల్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుంకు చెన్నక్రిష్ణయ్య (98) ఆదివారం మృతిచెందారు. ఈయన 1927 ఫిబ్రవరి 7న జన్మించారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు హోల్‌సేల్ మర్చెంట్ అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన హిందూపురం లోని ఎస్‌డీజీఎస్ కళాశాల స్థాపన కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. కొన్నేళ్లపాటు ఈయన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాప్యంతో ఆదివారం మృతి చెందారు. ఈయన మృతిపట్ల హిందూపురంలోని వ్యాపారస్థులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య సుబ్బరత్నమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ



బత్తలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అనంతసాగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం రామలింగేశ్వర స్వామి, అమ్మవారు, వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు హోమాలు వివిధ పూజా కార్యక్రమాలను వేదిపండితులు ని ర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్ర జ్వాలాతోరణం నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి కొబ్బరి కాయలు కొట్టించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడగార్లగుట్ట గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాల వినియోగం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవంలో సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, వక్కళిగ సాధికర సమితి అధ్యక్షుడు పాండురంగప్ప, రామక్రిష్ణ, మండల కన్వీనర్ ఈరన్న, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మణూరు గ్రామానికి చెందిన కదురప్ప (45) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కదురప్ప గతంలో బెంగళూరులో కూలి పని చేస్తుండేవాడు. అయితే ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కాలుజారి కిందపడటంతో తలకు బలమైన దెబ్బతగిలింది. ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి అతడికి మతిస్థిమితం లేదు. కాగా ఈనెల 4న ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించారు. అయినా ఆచూకీ లభ్యంకాలేదు. శనివారం గ్రామ సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు తెలుపగా ఆదివారం వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృ తుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కార్తీక వనభోజనాలు

ధర్మవరం రూరల్, నవంబరు, 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరులో పురాతన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధాత్రి నారాయణ పూజ, అభిషేకాలు, హోమాలు, కార్తీక వనభోజనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలను అర్చకులు రాఘవ శర్మ, ఆయన శిష్య బృందం వేద మంత్రాల నడుమ నిర్వహిం చారు. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు ధర్మవరం పట్టణ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా ఆలయంలో చంద్రమౌళీ శ్వర స్వామి లింగాన్ని ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, ఆలయం వద్ద దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్త జనం పాల్గొన్నారు.



హోమాలు చేస్తున్న వేద పండితులు, (ఇన్‌సెట్‌లో)చంద్రమౌళీశ్వరుడు

వైసీపీ పానలో పరిశ్రమలకు ఆటంకాలు

మంత్రి అనగాని సత్యప్రసాద్



చెక్కులు అందజేస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస పాలనలో పరిశ్రమలకు ఈ ప్రాంతంలో ఆటంకాలు కలిగించారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం రెవెన్యూ స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న మంత్రి సత్యప్రసాద్ పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి సవితతో కలిసి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 42 మందికి రూ.38లక్షలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 2014-19సంవత్సరంలో సీఎం చంద్రబాబు చొరవతో కియా, అనుబంధ పరిశ్రమలు తీసుకొచ్చామన్నారు. అదే తరహాలో మరిన్ని పరిశ్రమలు పెనుకొండ, హిందూపురానికి రానున్నాయన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఊరటనిస్తుందన్నారు. కార్యక్రమంలో గుట్టూరు సూరీ, కన్వీనర్ శ్రీరాములు, మావటూరు గోపాల్, బాబుల్‌రెడ్డి, శ్రీనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'కనకదాస జయంతికి రండి'

పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఈనెల 16న కనకదాస జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆ కులస్థులు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవితను కురుబ సంఘం నాయకులు కనకదాస జయంతిలో పాల్గొనాలని ఆహ్వానించారు.

నగర పంచాయతీకి నిధులు కేటాయించండి

కన్వీనర్ శ్రీరాములు

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కన్వీనర్ శ్రీరాములు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. నిరుపేదలకు సంబంధించి గృహనిర్మాణాలకు అవసరమైన 30ఎకరాల అనువైన భూమిని కేటాయించాలని విన్నవించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం కన్వీనర్ మాట్లాడుతూ పెనుకొండ సమీపంలో ఇస్లాపురం గ్రామానికి వెళ్లే రహదారికి అదనంగా భూమిని సేకరించి రోడ్డు నిర్మాణం చేయాలని, చారిత్రాత్మక ప్రాంతమైన పెనుకొండ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు విడుదల చేయాలని వినతిలో కోరామన్నారు.

కోనాపురం రోడ్డు పనులు ప్రారంభం



నారాయణమ్మ కాలనీ మీదుగా వేస్తున్న సీసీ రోడ్డు

పెనుకొండ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాల నుంచి పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లేదారి గుంతలమయంగా మారింది. మంత్రి సవిత చొరవతో పెనుకొండలోని మడకశిర రహదారి నుంచి కోనాపురం వెళ్లే రహదారి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభమయ్యాయి. రూ.80లక్షలు నగర పంచాయతీ నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాంతియుతంగా జీవించండి: సీఐ



రొద్దంవారిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

చిలమత్తూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘర్షణలు పడకుండా శాంతియుతంగా జీవించాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ సూచించారు. మండలంలోని రొద్దంవారిపల్లి, మాదిరెడ్డిపల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రజలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణకై ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని గుర్తించి మసలుకోవాలన్నారు. మహిళలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తున్నట్లైతే వెంటనే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు అవసరం

ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత

పరిగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యలు పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు అవసరమని ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుమలత పేర్కొన్నారు. పరిగి మండలంలోని ఐకాన్ కళాశాలలో పరిగి మండల ఏఐఎంఎస్ఎస్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమలత మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయన్నారు. దీంతో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, మద్యం, మత్తుపదార్థాలు, అశ్లీల సినిమాలు వీటిని నిషేధించాలన్నారు. వీటిపై పోరాటం చేయాలంటే బలమైన ప్రజా ఉద్యమం అవసరమన్నారు. మహిళలు ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్ఎస్ సభ్యులు అశ్విని, వనజ, శిరీష, నందిని పాల్గొన్నారు.

పురంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్‌నాయక్

హిందూపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆల్‌హిలాల్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈఎన్‌టి వైద్యులు శంకర్ నాయక్ పాల్గొని 450 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి పంచేంద్రియాలు ముఖ్యమన్నారు. ఇందులో ముక్కు, చెవి, గొంతు చాలా సున్నితమైందన్నారు. వాటిని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.